ప్రజాశక్తి

గురువారం 27 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతు చిక్కని లెక్క..

- జివిఎంసి మేయర్, రెండు డిప్యూటీ మేయర్లకు మల్లగుల్లాలు
- ఆశలు వదులుకున్న వైసిపి!
- అత్యాశకు పోతున్న కూటమి పార్టీలు
- టిడిపి, జనసేన ఎమ్మెల్యేల మధ్య పొడచూపుతున్న విభేదాలు!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసిపై పట్టుకోసం 'కూటమి' పార్టీలు ఒకవైపు, తమ సంఖ్యా బలాన్ని నిలబెట్టుకునేందుకు వైసిపి మరోవైపు రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నాయి. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జివిఎంసికి కమిషనర్ లేడన్న అంశం కంటే 'పీఠాల'పై తాము కూర్చొండిపోయి పాలన చేసెయ్యాలన్న తాపత్రయం కూటమి నేతలను పట్టిపీడిస్తోంది. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కూటమి నేతలు వైసిపి కార్పొరేటర్లను ఆకర్షించి సుమారు 30 మందిని తమవైపు లాక్కోవడం తెలిసిందే. దీంతో వైసిపి సంఖ్యా బలం నగర పాలక సంస్థలో 29కు చేరుకుంది. అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశానికి తేదీ ఖరారయ్యాక రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. జివిఎంసి మేయర్ పీఠం దక్కించుకోడానికి టిడిపి, జనసేన, బిజెపిలో ఏకాభిప్రాయం కుదరడంతో ఈనెల 22న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ ఇస్తూ పీలా శ్రీనివాస్ మేయర్ అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేశారు. 15 రోజుల ముందు కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చి కౌన్సిల్ జరపాల్సి ఉంది. ఇది జరిగేలోపు అనేక సిగపట్లు కూటమి నేతలు పడుతున్నారు. దక్షిణం, తూర్పు ఎమ్మెల్యేల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. జనసేనకు డిప్యూటీ ఇవ్వడం తెలుగుదేశానికి, టిడిపికి డిప్యూటీలంటే జనసేన నేతలు మండిపడుతున్నారు.

ప్రలోభాలు... రాజకీయ శిబిరాలు...

అధికారం ఉంటే ఏదైనా చేసుకోవచ్చన్న ఆలోచనతో పలువురు వైసిపి కార్పొరేటర్లు టిడిపి, జనసేన, బిజెపి ఇలా ఎవరికి అనువైన పార్టీలో వారు ఇప్పటికే చేరిపోయారు. కూటమి నేతలకు కూడా సంఖ్య రీత్యా, మేయర్ పీఠం కోసం అందరినీ రా...రమ్మని ఆహ్వానించారు. తాజాగా పెద్ద చిక్కే కూటమి నేతలు ఎదుర్కొంటున్నారు. ఒక మేయర్ పదవికి ఎక్కడా భిన్నాభిప్రాయాలు లేకపోయినా 2 డిప్యూటీ మేయర్ పీఠాలపై ఎవరికి వారు కూటమి నేతలు పట్టుబిగుస్తున్నారు. సుమారు 10 నుంచి 12 మంది పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఒకరికి మరొకరు ఆఫర్‌లు ఇచ్చుకుంటున్నట్లు భోగట్టా. టిడిపి, జనసేన, బిజెపి ఇలా తమకు డిప్యూటీకి సహకారం అందిస్తే రూ.కోట్లు విలువైన పనులు ఇస్తానంటూ డిప్యూటీ పీఠం కోసం పావులు కదుపుతున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ తతంగం అంతా అర్థం చేసుకున్న వైసిపి అధిష్టానం తమ కార్పొరేటర్లు

మిగతా 2లో..

గ్రోత్ హబ్ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి

జిల్లా వార్షిక ప్రణాళికను వివరించిన కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖ జిల్లా ప్రణాళికను వివరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గ్రోత్ హబ్ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న మూడో విడత కలెక్టర్ల సదస్సులో రెండో రోజు బుధవారం విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. విశాఖపట్టణం రీజియన్ గ్రోత్ హబ్, వ్యవసాయ అనుబంధ రంగాల్లో చేపట్టబోయే చర్యల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్దేశించిన 2.5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాలకు అనుగుణంగా గ్రోత్ హబ్ కార్యసాధనలో భాగంగా విశాఖ రీజియన్‌లో నిర్దేశించిన 715 బిలియన్ డాలర్ల లక్ష్యం చేరుకునేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. జిడిపి వృద్ధిలో రీజియన్ వాటా 15.7 శాతం అనగా రూ.1,45,774 కోట్లు ఉండేలా కృషి చేస్తామని, తలసరి ఆదాయం రూ.6,14,763 సాధించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

ప్రాథమిక రంగంలో రెట్టింపు శాతం లక్ష్యాలను చేరుకుంటాం

జిల్లాలో రంగాల వారీగా చూస్తే జివిఎ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వ్యవసాయ రంగం వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉందని, దీన్ని 10 శాతానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ వివరించారు. నగదు రూపంలో చూస్తే రూ.68 కోట్ల మేర మాత్రమే వ్యవసాయ రంగం వాటా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో అనేక కారణాల వల్ల సుమారు 2 వేల హెక్టార్ల బీడు భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వచ్చే ఏడాదిలో 200 హెక్టార్ల బీడు భూముల్ని సాగులోకి తీసుకొస్తామని చెప్పారు. వరి, మిలెట్ల సాగులో వినూత్న సంస్కరణలు చేపడతామని, కొత్త వంగడాలను ప్రవేశపెడతామని తెలిపారు. వరిలో ఎంటియూ-1224, ఆర్ఎన్ఆర్-15048 వంటి వంగడాలను, మిలెట్లలో ఇంద్రావతి, వేగవతి వంటి నూతన రకాలను అందుబాటులోకి తీసుకొచ్చి ఉత్పాదకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

స్విగ్గీ, జోమోటో రైడర్లకు రక్షణ కల్పించాలి

వార్త 2లో..

1న సుబ్బారావు వర్థంతి సభ

వార్త 2లో..

12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను నియమించాలి : యుటిఎఫ్

వార్త 5లో..

భీమిలి మండల పరిధి యాతపేటలో సమస్యలు తెలుసుకుంటున్న జగ్గునాయుడు తదితరులు

సమిష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వార్తలు 4లో..

శోకంలో చెరుకు రైతు

- గోవాడ సుగర్స్‌కు ప్రభుత్వ సహకార లేమి
- ఆధునీకరణపై తప్పిన మాట
- తరచూ మరమ్మతులు, తగ్గిన రికవరీ
- రైతులకు ఇవ్వని బిల్లులు
- కార్మికులకు అందని జీతాలు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'చెరుకు పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడంలేదు. తోలిన చెరకుకు బిల్లులు చెల్లించడంలేదు. ఫ్యాక్టరీ ఆగిపోతుండడంతో రికవరీ పడిపోతుంది. ఒకరోజా, రెండ్రోజులా ఎంతకని ఈ బాధపడతాం. పంటలు మానుకోలేక పండించినందుకు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు' అని చోడవరం (గోవాడ) సహకార చక్కెర ఫ్యాక్టరీ రైతులు వాపోయారు. అనకాపల్లి జిల్లాలో టిడిపి ప్రభుత్వంలో తుమ్మపాల, వైసిపి ప్రభుత్వంలో ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిచిపోయాయి. రాష్ట్రంలోని ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీ శ్వాస తీసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లుంది. గోవాడను ఆధునీకరించి రైతును ఆదుకుంటామన్న మాట తప్పింది. పంచదార అమ్మకాలపై విధించిన ఆంక్షలతో అమ్మలేక కోట్ల రూపాయల విలువైన పంచదార నిల్వలు ఫ్యాక్టరీలో ఉన్నాయి. ప్రస్తుతం పౌర సరఫరాల సంస్థ ప్రయివేటు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్న ధర కంటే

మిగతా 2లో..

స్విగ్గి, జోమోటో రైడర్లకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిగ్వి, జోమోటో రైడర్లకు రక్షణ కల్పించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు బి.జగన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, యూనియన్ నాయకులు చక్రవర్తి, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, విశాఖ ఆక్సిజన్ టవర్స్‌లో 3 రోజుల క్రితం డెలివరీ బాయ్ అనిల్‌ను బట్టలు విప్పి కొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. గిగ్గ్ వర్కర్ల (జోమోటో, స్విగ్గి, ఫ్లిప్‌కాట్, ర్యాపిడో, ఓలా, ఊబర్)పై ఇప్పటికే అనేక దఫాలు దాడులు జరిగాయన్నారు. ప్రతిసారి ఎవరో ఒకరిపైన దాడి జరిగిన తరువాత శిక్షించడం కాకుండా, రక్షణ కల్పిస్తూ చట్టం చేయాలని కోరారు. ఇప్పటివరకు స్విగ్గీ మేనేజర్ కానీ, సంస్థకు చెందినవారెవరూ కూడా బాధితుని పరామర్శించలేదన్నారు. ఇటువంటి భద్రత లేని సంస్థల్లో పనిచేయడం తప్పనిసరి అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎటువంటి కారణం లేకుండా ఒక్క సెకనులో రైడర్లను తొలగిస్తున్నారని తెలిపారు. రోజంతా పనిచేసినా కనీసం రూ.500 కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైడర్లకు రక్షణ, ఉద్యోగ భద్రత, కనీస ఆదాయం వచ్చే విధంగా చట్టాలు చేయాలని డిమాండ్‌చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఏ ఉద్యోగాలు లేక ఫుడ్, మెడిషన్, నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తూ సేవలు అందిస్తున్న ఈ రైడర్లకు కనీసం కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు బంగ్రారాజు, రాజేష్, రమేష్, సాగర్, ఉదయ్, విశాఖ క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోలీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మొదటి పేజీ తరువాయి..

అంతు చిక్కని లెక్క...

సుమారు 28 మందిని బెంగళూరుకు మకాం మార్చేసింది. బలహీనమైన కార్పొరేటర్లుండడంతో వారిని నిలబెట్టుకోవాలని వైసిపి నిర్ణయించింది.

అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ జరగనుంది. 15 రోజుల ముందే ఆ తేదీని కలెక్టర్ నిర్ణయిస్తారు. ఈనెల 29న జివిఎంసి బడ్జెట్ సమావేశం కూడా ఉంది. కూటమిలో తమ వారు ఇంకా చేరకుండా జాగ్రత్తలు వైసిపి తీసుకుంది. మరో 20 రోజుల వ్యవధిలో గానీ నగరపాలక సంస్థలో రాజకీయాలు ఒక కొలిక్కి రావన్నది తెలుస్తోంది. ఓటింగ్ జరిగితేగానీ ఎవరికి ఏ పీఠం దక్కుతుందో తేల్చడం కష్టమే. అంత:కరణ శుద్ధితో ఓటు వేస్తారా? అంతర్గత లాబీయింగులు ఏమైనా పనిచేస్తాయా? చూడాల్సిందే.

శోకంలో చెరుకు రైతు

కేజీకి రూపాయి తగ్గించి సరఫరాచేస్తామని గోవాడ సుగర్ పరిశ్రమ నుంచి వెళ్లిన ప్రతిపాదనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. గోవాడ పంచదారను పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఫ్యాక్టరీకి సరఫరా చేసిన రైతుకు కొంతైనా బిల్లులు చెల్లించే పరిస్థితిలో పరిశ్రమ ఉండేది.

ఫ్యాక్టరీని వదిలించుకుందామని అటు పంచదార కొనక, ఇటు కనీస సాయం చేయక రైతును మానసికంగా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోంది. గతేడాది బకాయి రూ.7.16 కోట్లు, ఈ ఏడాది బకాయి రూ.25.14 కోట్లు రైతుకు యాజమాన్యం చెల్లించాల్సివుంది. కార్మికులకు రూ.7 కోట్లు జీతం బకాయి ఉంది. రైతు, కార్మికుల బకాయి చెల్లించేందుకు పంచదార, మొలాసిస్ నిల్వలపై రుణమివ్వడానికి కూడా ప్రభుత్వం ముందుకురావడంలేదు. పరిశ్రమను ఆధునీకరించకపోగా, క్రషింగ్ రోజువారీ సామర్థ్యం 4వేల టన్నుల చెరుకు కంటే తక్కువ ఆడుతున్నా ఫ్యాక్టరీ పరిధిలోని బిజెపి అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, చోడవరం, మాడుగుల కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కెఎస్ఎన్ఎస్.రాజుకు చీమకుట్టినట్లయినా లేదు. రైతులు రోడ్లపైకి వచ్చినా వారు చలించడంలేదు. ఈ మార్చి 20 నాటికి క్రషింగ్ ప్రారంభించి 57 రోజులవుతున్న ఈ కాలంలో నాలుగువేల టన్నుల చొప్పున 2.28 లక్షల టన్నుల క్రషింగ్ జరగాల్సివుంది. కానీ పాత యంత్రాలుకావడం, నిర్వహణ సరిగాలేక తరచూ మరమ్మతులకు గురవడంతో సగటున రోజుకు 1400 టన్నుల చొప్పున 79,800 టన్నుల క్రషింగ్ జరిగింది. గత మూడేళ్లలో 9 శాతానికిపైగా వచ్చిన రికవరీ ఈ ఏడాది 8 శాతానికి పడిపోయింది. 2023-24 సీజన్‌లో లక్షా 70 వేల టన్నుల చెరకు క్రషింగ్‌కు 9.02 శాతం రికవరీపై లక్షా 46వేల క్వింటాళ్ల (టన్నుకు 86 కేజీల) పంచదార దిగుబడిరాగా, 2024-25 సీజన్‌లో 79,800 టన్నుల క్రషింగ్‌కు 8 శాతం రికవరీపై 41,837 క్వింటాళ్ల (టన్నుకు 52 కేజీల) పంచదార దిగుబడి వచ్చింది. అంటే... టన్నుకు సుమారు 34 కేజీల పంచదార దిగుబడి తగ్గింది. ఈ ఏడాది లక్షా 20వేల టన్నుల చెరకు క్రషింగ్ జరుగుతుందని యాజమాన్యం అంచనా వేసినప్పటికీ, పొలాల్లోని చెరకు మొత్తం క్రషింగ్ చేసే పరిస్థితిలో పరిశ్రమలేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

2025 మార్చి 20నాటి సమాచారం ప్రకారం

చెరకు క్రషింగ్ రోజువారీ సామర్థ్యం	: 4వేల టన్నులు
జరిగిన క్రషింగ్	:79,800 టన్నులు (సగటున 1400 టన్నులు)
రికవరీ	: 8 శాతం
పంచదార ఉత్పత్తి	:41,837 క్వింటాళ్లు (క్వింటా ధర రూ.3,825)
మొలాసిస్ ఉత్పత్తి	:5181 మెట్రిక్ టన్నులు (టన్ను రూ.16,580)
రైతుకు చెల్లించాల్సిన గతేడాది బకాయి	: రూ. 7.16 కోట్లు
ఈ ఏడాది బకాయి	: రూ. 25.14 కోట్లు
కార్మికులకు బకాయి	: రూ.7 కోట్లు
ప్రస్తుతం పంచదార నిల్వ :	45వేల క్వింటాళ్లు, విలువ రూ.17.21 కోట్లు
మొలాసిస్ నిల్వ	:5,181 మెట్రిక్ టన్నులు, విలువ రూ.8.59 కోట్లు

అగ్ని మాపక పరికరాలు అమర్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎకు చెందిన దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో తప్పనిసరిగా అగ్ని మాపక పరికరాలు అమర్చాలని సంస్థ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సెంట్రల్ పార్క్ ఎదురుగా విఎంఆర్‌డిఎకు చెందిన షాప్ 14లో బుధవారం అగ్నిప్రమాదం జరగడంతో విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ, కార్యనిర్వహక ఇంజినీర్ రామరాజుతో కలిసి ప్రణవ్ గోపాల్ పరిశీలించారు. ప్రమాద తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, ఇకపై విఎంఆర్‌డిఎకు చెందిన అన్ని దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

1న సుబ్బారావు వర్థంతి సభ

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి మున్సిపల్ వర్కర్స్ , ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు గొల్లపల్లి సుబ్బారావు 2వ వర్థంతి సభను షీలానగర్‌లోని ఆయన నివాసంలో ఏప్రిల్ 1వ తేదీన నిర్వహిస్తున్నారని, కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళి అర్పించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వివిధ జోన్ బాధ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, పారిశుధ్యం, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్స్, యుజిడి, వెటర్నరీ, పార్కు, మలేరియా తదితర విభాగాల కార్మికులు సుబ్బారావు వర్థంతి సభలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అన్ని వార్డు మస్టర్ ఆఫీసుల వద్ద ఉదయం సుబ్బారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించాలని చెప్పారు. ఏప్రిల్ 2వ తేదీన యూనియన్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ర్యాలీ, బహిరంగ సభ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఉదయం 10:30 గంటలకు రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుండి ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అప్కోస్ రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆ రోజు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ముద్దాడ ప్రసాద్, గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఈ.ఆదినారాయణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దక్షిణ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆశీలుమెట్ట వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం నిరుపేద మహిళా జర్నలిస్టు, వైజాగ్ ఫోకస్ రిపోర్టర్ జయశ్రీకి వైద్య ఖర్చుల నిమిత్తం తన సొంత నిధులు రూ.5 వేలు గణేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జయశ్రీ శస్త్ర చికిత్సకు అవసరమైన సహాయం అందిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు 4 సెంట్లు ఇళ్ల స్థలం, హెల్త్ కార్డులు, అక్రిడేషన్లు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు తోడుగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి విశాఖ జిల్లా కార్యదర్శి గురజాపు రవి, దక్షిణ మహిళా ప్రెసిడెంట్ వాసుపల్లి బంగారమ్మ, 30వ వార్డు అధ్యక్షులు దశమంతులు మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, పాత్రోజు అర్జున్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ భారతీయ కేలండర్‌తో నూతన సంవత్సరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంప్రదాయ భారతీయ కేలండర్‌తో నూతన సంవత్సరాన్ని ఆరంభించడానికి భగవద్గీత కేంద్రంగా విశిష్టమైన 18 నెలల కేలండర్ రూపొందించినట్లు సైకిల్ పూర్ అగరబత్తి ఎమ్‌డి అర్జున్ గంగ తెలిపారు. ఈ కేలండర్ ద్వారా భగవద్గీతలోని జ్ఞానాన్ని ఆధునిక తరాలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రోజువారీ జీవిత సమస్యలకు స్పష్టత, వివేకాన్ని అందించేందుకు లక్ష్యంగా రూపొందించామని తెలిపారు.

వాణిజ్య సంస్థల్లో పార్కింగ్ ఉచితం

సమావేశంలో మాట్లాడుతున్న కన్జ్యూమర్ కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టిప్లెక్స్‌లలో పార్కింగ్ రుసుమును యాజమాన్యాలు కానీ, బయటి వ్యక్తులు కానీ వసూలు చేయరాదని ఎపి రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఖచ్చితమైన ఉత్తర్వులు జారీ చేసిందని కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుము వసూలుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయని తెలిపారు. వాహనాల పార్కింగ్ వ్యవధి మొదటి 30 నిమిషాల వరకు ఉచితం అని పేర్కొన్నారు. 30 నిమిషాల పైన తర్వాత ఒక గంట వరకు వాహనం పార్క్ చేసిన వ్యక్తికి ఎంత మొత్తానికి అయినా బిల్లు ఇస్తే అది కూడా ఉచితంగానే అని తెలిపారు. ఒక గంట పైన సంబంధిత మాల్, మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువు చూపించకపోతే ఇతర వ్యక్తుల విషయంలో పేర్కొన్న వ్యవధికి సూచించిన పార్కింగ్ రుసుము వసూలు చేయవచ్చన్నారు. వాహనాన్ని పార్క్ చేసిన వ్యక్తి సంబంధిత మాల్, మల్టిప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువుగా బిల్లు, సినిమా టికెట్ చూపిస్తే ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ ఆదేశాలు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయన్నారు. ఈ సమావేశంలో కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ ప్రెసిడెంట్ వి.విక్రమ్‌రాజు, నేషనల్ సెక్రటరీ దొడ్డి చంద్రశేఖర్, విశాఖ జిల్లా ఇన్చార్జ్ ఇక్బాల్ జాఫర్, న్యాయవాది సుకన్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - సబ్బవరం

<u>రేఖా నెం. 28/2025</u> **<u>బహిరంగ వేలం నోటీసు</u>** <u>తేదీ.26-03-2025</u>

విశాఖపట్నం జిల్లా, సబ్బవరం మండలం, సబ్బవరం గ్రామపంచాయితీలో 2025-26 సంవత్సరమునకు (అనగా తే:01.04.2025 ది నుండి 31.03.2026ది వరకు) వారపుసంత (ఆది, గురువారములు) మరియు రోజువారీ మార్కెట్లలో అశీలు వసూలు చేసుకునే హక్కునకు వేలం వేయుటకు గాను నోటిఫికేషన్లోని షరతులకు లోబడి, పంచాయితీ కార్యాలయం వద్ద తే: 28-03-2025ది శుక్రవారం ఉదయం 11 గంటలకు, సబ్బవరం మంలం పంచాయితీ విస్తరణాధికారి **(EOPR&RD)** వారి సముక్షములో బహిరంగ వేలం జరుపబడును. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు, ఈ దిగువ షెడ్యూలలో వ.నెం.1,2 అయిటములకు ఎదురుగా తెలిపిన ధరావత్తునకు అదనముగా అదనపు ధరావత్తు రూ.1,00,000/-లు (అక్షరముల ఒక లక్ష రూపాయలు) చొప్పున చెల్లించి పాటలందు పాల్గొనవచ్చును.

షెడ్యూలు

వ. నెం.	పాట వివరములు	ప్రధమ ధరావత్తు
1.	వారపు సంత (ఆది, గురువారములు) ఆశీలు వసూలు చేసుకునే హక్కునకు	**10,000/-**
2.	రోజువారీ మార్కెట్‌లో అశీలు వసూలు చేసుకునే హక్కునకు	**10,000/-**

<u>షరతులు:</u> ఈ గ్రామపంచాయతీకి ఏ విధమైన బకాయి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు. (2) ఏ కారణం తెలుపకనే, వాయిదా వేయుటకు గాను, పాటను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు ఈ దిగువ సంతకందారునికి పూర్తి అధికారం కలదు. (3) పాటదారుడు కిస్తీ వాయిదాలు యొక్క సొమ్మునకు చెక్కులు ఇవ్వవలెను. (4) ఇతర వివరంలు తెలుసుకొనే వారు కార్యాలయ పని దినంలలో ఈ దిగువ సంతకం దారుని వద్ద తెలుసుకొనవలెయును.

సం/- కె.శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ, సబ్బవరం

ప్రభుత్వ స్థలాన్ని అమ్మేశారు..!

హెచ్చరిక బోర్డు మాయం చేసి విక్రయించారని ఆరోపణలున్న స్థలం

- కణితి రెవెన్యూ పరిధిలో అడ్డగోలుగా భూఅక్రమాలు?
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- బాధ్యులపై చర్యలకు స్వతంత్రనగర్ వాసుల డిమాండ్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక మండలంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, విక్రయాలు జోరుగా సాగుతున్నా యనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లిప్తత కారణంగా ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. గాజువాక మండలం కణితి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు దొంగల పాలవుతున్నా, ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ గాజువాక రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోణలున్నాయి. కణితి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూఆక్రమణ, అమ్మకమే దీనికి నిదర్శనంగా నిలుస్తోందని అంటున్నారు. గాజువాక మండలం కణితి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 299లో సుమారు 120 గజాలు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. దీన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు మాయం కాగా, ఆ స్థలాన్ని స్థానికంగా ఒక వ్యక్తి తప్పుడు సర్వే నంబర్‌తో వేరే ఒక వ్యక్తికి విక్రయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో సుమారు రూ.17 లక్షలు చేతులు మారినట్లుగా తెలుస్తోంది. స్వతంత్రనగర్ కాలనీకి ఆనుకుని ఉన్న ఈ స్థలం కాలనీ అవసరాల కోసం ఉంచారని తెలుస్తోంది. అయితే ఒక భూకబ్జా ముఠాకు చెందిన వ్యక్తి తన తెలివితేటలతో ఈ భూమిని వేరొక వ్యక్తికి అంటగట్టి రూ. 17 లక్షలు కాజేశాడు. దీనిపై ఆలస్యంగా కళ్ళు తెరిచిన స్థానికులు ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. తమ కాలనీ అవసరాల కోసం ఉంచిన స్థలాన్ని ఆక్రమించి, అమ్మేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజువాక రెవెన్యూ అధికారులుదీనిపై దృష్టిసారించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా అమ్మిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు, ఇపుడు ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

గాజువాక తహసిల్దార్ శ్రీవల్లి వివరణ

స్వతంత్రనగర్ స్థలం ఆక్రమణపై గాజువాక తహసిల్దార్ శ్రీవల్లి వివరణ కోరగా, దీనిపై తమ సిబ్బందిని పంపించి స్థలం ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. . గతంలో ఉన్న బోర్డు లేకపోతే మళ్ళీ పెడతామని తెలిపారు.

సామాజిక అవసరం కోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలి

కాలనీ ప్రజల సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించడానికి ఎవరైనా వస్తే చూస్తూ ఊరుకోమని సిపిఎం గాజువాజోన్ కార్యదర్శి ఎం రాంబాబు. హెచ్చరించారు. కాలనీ అవసరాల కోసం స్థలం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

వీధి దీపాలు ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి- పెందుర్తి :జివిఎంసి 88వ వార్డు నరవ, పెందుర్తి మండలం శివ సాయి నగర్ కాలనీ, రజకుల కాలనీ, ఎలిమెంటరీ స్కూల్ దగ్గర పలు వీధులలో జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు, , మాజీ ఎంపిటిసి ఇల్లపు శ్రీనివాసరావు చొరవతో జివిఎంసి అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయడంపై స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాలనీ వాసులు సమస్యను తమ దృష్టికి తెచ్చిన వెంటనే జనసేన నేతలు స్పందించి, జివిఎంసి విద్యుత్ విభాగం దృష్టికి తీసుకెళ్ళి వీధిదీపాల మరమ్మతులు, కొత్తవి ఏర్పాటుతో వెలుగులు నింపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాడిపెంటరావు, బొడ్డ నాయుడు పాల్గొన్నారు

28,29 తేదీల్లో 'అవంతి'లో యూత్ ఫెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 28,29 తేదీల్లో 'అవెన్సిస్ 2క 25' యూత్ ఫెస్ట్ ను నిర్వహించనున్నట్లు అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా శ్రీకృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె రాంజీ, కామన్వెల్త్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ విజేత నీలంశెట్టి లక్ష్మి, ఇన్స్పైర్ ఎడ్జ్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ చైతన్య హాజరు కానున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, ఉమ, నేహాలు అలరించనున్నారన్నారు.బాస్కెట్ బాల్, కబడ్డీ, వాలీబాల్, క్యారమ్స్ వంటి పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మూడో వార్డు బోయివీధిలో జివిఎంసి నిధులు రూ 3 లక్షలతో ఏర్పాటు చేసిన పైలట్ వాటర్ స్కీంను స్థానిక కార్పొరేటర్ గంటా అప్పలకొండ బుధవారం ప్రారంభించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నూక రాజు మాట్లాడుతూ, దీంతో బోయివీధిలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాసాపు దుర్గారావు, కె సూరిదు,వి సత్యారావు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు

ఊరూరా టిడిపి జెండాలు ఎగరేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 29న మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో పార్టీ జెండాను తప్పనిసరిగా ఆవిష్కరించాలని పార్టీ మండల అధ్యక్షుడు కె.రమణ అనారు. స్థానిక జిల్లా పరిషత్ బంగ్లా ఆవరణలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, వచ్చేనెల 15లోగా సభ్యత్వ కార్డులను అందరికీ అందజేయాలన్నారు. లక్ష్యానికి మంచి సభ్యత్వాలు నమోదు చేసిన బుద్ధవలస ఆగ్రహారం గ్రామ పంచాయతీకి చెందిన పైలా శ్రీను. అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం వెంకటరావులకు దుశ్శాలువాలతో సత్కరించారు కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, మాజీ మండల అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, రామరాజు, విజయబాబు, మహేష్, నందిని, పావని, మూర్తిచ కె. లక్ష్మీ నాయుడు పాల్గొన్నారు

వేతనాలు పెంచాలని మినీ వ్యాన్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -పద్మనాభం : వేతనాలను పెంచాలని కోరుతూ మినీ వ్యాన్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగారు. వీరికి సిఐటియు నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర ధరలు, ఇతర ఖర్చులకు అనుగుణంగా మినీ వ్యాన్ కార్మికులకు ఇస్తున్న వేతనాలు ఎటూ సరిపోవడం లేదన్నారు. దీనిపై వేతనాలను పెంచాలని కోరుతూ సంబంధిత యజమానులకు విన్నవించినా వారి నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా సమ్మె చేస్తున్నారన్నారు. సిఐటియు జోన్ కమిటీ నాయకులు ఎస్ అప్పల నాయుడు మాట్లాడుతూ మినీ వ్యాన్ కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని,పిఎఫ్, ఇఎస్ఐ ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. వ్యాన్ డ్రైవర్లకు అన్యాయం జరుగుతున్నా సంబంధిత కార్మికశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మినీ వ్యాన్ యజమానులు స్పందించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మినీ వ్యాన్ డ్రైవర్ల సంఘం ప్రెసిడెంట్ ఆర్ సురేష్, సెక్రెటరీ వి నాగరాజు, కోశాధికారి ఎం సురేష్, కె.బంగార్రాజు, ఎస్ పరమేష్,

మినీ వ్యాన్ డ్రైవర్లకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు నేతలు

విద్యార్థుల్లో స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించాలి

అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ బిఎల్.రెడ్డి

ప్రజాశక్తి-మధురవాడ : విద్యార్థులలో స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించాలని నిపుణులు సూచించారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇన్నోవేషన్ సెల్ ఏఐటిసిఇ సంయుక్తంగా గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర కళాశాలలలోని అధ్యాపకులకు 'ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌'పై ప్రత్యేక ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన ఆవిష్కరణలు, మేధోహక్కులు, మార్కెటింగ్ నైపుణ్యాలు ఆర్థిక ప్రణాళిక, స్టార్టప్ ఆలోచనలు, వినియోగదారుల అవసరాలను గుర్తించడం వంటివి స్టార్టప్‌ల విజయానికి ఏవిధంగా ఉపయోగపడతాయో వివరించారు. . గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవిశంకర్, డాక్టర్ సుబేంద్రకుమార్ మిశ్ర, జి.టెక్ మేనేజర్ డాక్టర్ కె.చంద్రమౌళి, వివిధ రంగాలకు చెందిన నిపుణులు అసుతోష్ తివారి, కునాల్‌గిర్, శ్రీరామ్ చిదంబరం వివిధ అంశాలపై మాట్లాడారు. ఎఐసిటిఇ ఇన్నోవేషన్ సెల్ మేనేజర్ డాక్టర్ బి.ఎల్.రెడ్డి పాల్గొని సర్టిఫికేట్‌లను అందజేశారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయండి

ప్రజాశక్తి -ములగాడ: టిడ్కో గృహ సముదాయాల్లో అవసరమైన సౌకర్యాలను కల్పించి, గతంలో గుర్తించిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సిపిఐ పశ్చిమ నియోజకవర్గంసహాయ కార్యదర్శి గుడాల రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం 63వ వార్డు కాకరలోవ గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గత టిడిపి ప్రభుత్వ హయాంలో మూడు కేటగిరీలుగా టిడ్కో ఇళ్లను మంజూరుచేసి, నిర్మించారని, ఈమేరకు లబ్ధిదారుల నుంచి వాటా సొమ్మును కట్టించుకోవడంతోపాటు, మిగతా సొమ్ముకు బ్యాంకు రుణాలు మంజూరు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఎనిమిదేళ్ల గడుస్తున్నా నేటికీ లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. దీంతో సొంతింటి కల సాకారం చేసుకోవడానికి ఆశగా ఎదురుచూస్తున్న పేద లబ్ధిదారులు నాటి నుంచి బ్యాంకు రుణాలకు వడ్డీతోకూడిన అప్పు వాయిదాలు చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అచ్యయ్యనాయుడు లోవలో 4600 టిడ్కో ఇళ్లు ఉండగా ములగాడలో 326 ఇల్లు ఉన్నాయన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్లు కావడంతో గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పట్టించుకోలేదని, ఇపుడు టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఇప్పటికైనా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అవసరమైతే లబ్ధిదారుల తరపున సిపిఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై కనకేశ్వరరావు, టి.కామేశ్వరరావు, శ్రీనివాసరావు, సురేష్ వెంకట్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బిసి రోడ్డు వాంబే కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. కాలనీలో నివాసముంటున్న పవన్ (21) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు అంటున్నారు. పూర్తి వివరాలు తెలియ రాలేదు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

జీవరాశుల సంరక్షణ మానవాళి బాధ్యత

మాట్లాడుతున్న సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దేవాంగన్

ప్రజాశక్తి- ములగాడ : జీవరాశుల సంరక్షణ బాధ్యత మానవాళి చేపట్టాలని కేంద్ర పరిశ్రమల రక్షణ విభాగం (సిఐఎస్ఎఫ్) డిప్యూటీ కమాండెంట్ ప్రిషాబ్ దేవాంగన్ అన్నారు. బుధవారం మల్కాపురం సిఐఎస్ఎఫ్ కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఓ నేతృత్వంలో పక్షులు, వన్యప్రాణులకు నీరు, ఆహారానికి ధాన్యం కంకుల కుచ్చులు అందుబాటులో ఉంచారు. . ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో పక్షులు, వన్య ప్రాణులకు తాగునీరు, ధాన్యం, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు ఆహారం అందుబాటులో ఉంచడం బాధ్యతగా చేపట్టాలని సూచించారు. భావితరాలకు పిచ్చుకలు వంటి జీవరాశులను చూపాలంటే వాటిని సంరక్షించాల్సి అవసరం ఉందన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్ కుమార్ శర్మ,.సిఐఎస్ ఎఫ్ అధికారి సందీప్ కుమార్, సంస్థ అధికారి సయ్యద్, సంరక్షిక సంస్థ అధ్యక్షురాలు షీలూ జైన్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, మురళి పాల్గొన్నారు.

షటిల్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు లక్ష్మీ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో షటిల్ కోర్టును ప్రభుత్వ విప్ పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వపరంగా ప్రోత్సాహిస్తున్నామన్నారు. క్రీడాకారులతో కాసేపు షటిల్ ఆడారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు నరిపిన్ని సత్తిరాజు, హెచ్ఎం ,మోహనరావు , నాయకులు బంగారు తులసిరామ్, శరత్ చంద్ర, నరవ అనూష, అలజంగి శ్రీను, రొక్కం కొండలరావు, బోనెల రామకృష్ణ, ఏలుసిరి శివ, రాము, కనక, దుర్గేష్, ఉమామహేశ్వరరావు, ఆదినారాయణ, రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేతన వ్యత్యాసం లేకుండా చూడాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ల న్యూ షిఫ్ట్ ఆపరేటర్ల నిరసన

ప్రజాశక్తి- సీతమ్మధార : గత ప్రభుత్వ హయాంలో 33/11 కెవి సబ్‌స్టేషన్లలో నియమింపబడిన షిఫ్ట్ ఆపరేటర్లకు సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని కోరుతూ సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద న్యూ షిఫ్ట్ ఆపరేటర్స్ నిరసన చేపట్టారు. అనంతరం ఫైనాన్స్ హెడ్, అర్‌డి డైరెక్టర్ డి.చంద్రానికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దాదాపు రెండు వేలమంది షిఫ్ట్ఆపరేటర్లుగా నియమితులుకాగా, పాత ఆపరేటర్ల వేతనాలు వర్తింప చేయకుండా, గత ప్రభుత్వం ఎపిసిఓఎస్ జిఓ ద్వారా వేతనాలు నిర్ణయించడంతో ప్రస్తుతం రూ.18,500 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పాత ఆపరేటర్లకు రూ.27,953 వేతనం ఇస్తుండగా, తమకు దాదాపు రూ.పది వేలు వేతన వ్యత్యాస ఉండడం దారుణమన్నారు. ఒకే సబ్‌స్టేషన్లో ఒకే రకమైన డ్యూటీ చేస్తున్న ఆపరేటర్స్ మధ్య వేతన వ్యత్యాసం సరిచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారులు, మంత్రుల చుట్టూ తిరిగి మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వేతనాలు పెంపులో కొత్త, పాత అనే తారతమ్యం లేకుండా చూశారని, ఇపుడు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

సమిష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ప్రజా చైతన్యయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సీతమ్మధారలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : కలిసికట్టుగా పోరాడితే సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ప్రజలకు సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, భరోసా ఇచ్చారు. బుధవారం సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు ఎస్ అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, పంపాన సూర్యనారాయణ, రీసు నరసింగరావు, జోగ వెంకటరావు, గుజ్జు నరసింగరావు తదితరులతో బాలాజీనగర్, యాతపేట తది తర ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తాగునీరు, వంటగ్యాస్ రాయితీ రహదారులు, ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్‌వైర్లు, ఇంటిస్థలాలు, ఇళ్ళ తదితర సమస్యలపై స్థానికులు విన్నవించారు. గత ప్రభుత్వంలో ఆనందపురం మండలం ,జగన్నాథపురం వద్ద జగనన్న ఇళ్ళు మంజూరుచేసి, నిర్మాణాలు చేపట్టారని, అయితే ఏ స్థాయిలో ఉందో ఎవరికీ తెలియదన్నారు. ఆయా సమస్యలపై పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని జగ్గునాయుడు భరోసానిచ్చారు.

డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు

ములగాడ : జివిఎంసి 59వవార్డు హనుమాన్‌నగర్ కొండపై నివసిస్తున్న ప్రజలకు రోడ్లు, మెట్లు నిర్మించినా, వాడుకనీరుతోపాటు వర్షపునీరు ఇళ్లల్లోకి చొరబడి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మించాలని అధికారులు, నేతలకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్న స్పందన లేదని వాపోయారు. బుధవారం సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా పార్టీ మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ఇంటింటా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిపిఎం కార్యకర్తలు కె.రమణ ప్రశాంత్ రామకృష్ణ ఈశ్వరరావు దుర్గారావు, ఎం.శ్రీను పాల్గొన్నారు.

ములగాడ కొండవాలులో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర

సీతమ్మధార : జివిఎంసి 45వవార్డు ఎస్ఆర్ నగర్, చిట్టిబాబుకాలనీలో సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో పార్టీ రాష్ట్ర నాయకులు బి పద్మ, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, జిల్లా నాయకులు రాజు, బొట్టా ఈశ్వరమ్మ జోన్ నాయకులు గౌరీష్, అప్పలరాజు తదితరులు పాల్గొని ఇంటింటా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల, ఇంటిస్థలాలు, ఉచిత గ్యాస్ డబ్బులు, పింఛన్ల ఇతర పథకాలు అందడం లేదని పలువురు సిపిఎం బృందం దృష్టికి తేగా, ఆయా సమస్యల పరిష్కారానికి పోరాటంలో సిపిఎంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి బాబాజీ

ప్రజాశక్తి -తగరపువలస : ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, పరిష్కారానికి చొరవ చూపాలని చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. బుధవారం చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో సంఘప్రతినిధుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ మాట్లాడుతూ ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛను రూ.మూడు వేలు ఇస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు.

దీనిపైప్రధాని, ఆర్థిక, కార్మికశాఖ మంత్రులు, ఇపిఎఫ్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదనంగా రూ. వెయ్యి పెంచారని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ స్పందిస్తూ, పెన్షనర్ల వినతినివాట్సాప్ ద్వారావిశాఖ ఎంపి ఎం.శ్రీ భరత్‌కు పంపుతానని హామీనిచ్చారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, కోశాధికారి పంపా న సూర్య నారాయణ, సింగిడి అప్పారావు పాల్గొన్నారు

హామీని నిలబెట్టుకోవాలని వినతి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు మల్కాపురం గ్రామ సదనపట్టు స్థలంలో రూఫ్ టాప్ నిర్మాణ హామీని నిలబెట్టుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబుకు గ్రామ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు.దీనిపై సివిల్ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించి, అంచనా వేయాలని కోరగా, రూ.23లక్షలు ఖర్చవుతుందంటారని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై గణబాబు స్పందిస్తూ హెచ్‌పిసిఎల్ యాజమాన్యంతో మాట్లాడి, సిఎస్ఆర్ నిధులు మంజూరు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు భోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు సత్యాల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, కోశాధికారి పట్నాలు పెంటారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పిడి వెంకటగిరి, పాల్గొన్నారు

పట్టాలు, పరిహారమిచ్చి ఆదుకోండి

అధికారులకు తర్లువాడ గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : తర్లువాడ రెవెన్యూ పరిధిలో ఒకటో నెంబరు సర్వేనెంబరు చుక్కకొండ వద్ద సర్వే చేస్తున్న ప్రభుత్వ అధికారులు గతంలో సాగు, స్వానుభవనంలో ఉన్న తమ పేర్లను నమోదుచేసి, పట్టాలు, పరిహారం ఇవ్వాలని తర్లవాడ గ్రామస్తులు కోరుతున్నారు. బుధవారం గ్రామ సచివాలయంలో అధికారులను కలిసి విన్నవించారు. తర్లువాడ రెవెన్యూ సర్వే నెంబరు 1లో చుక్కకొండ వద్ద 150 ఎకరాల భూమిలను గతంలో రైతులకు ఒక ఎకరా చొప్పున డిఆర్‌డిఎ కేటాయించి, అప్పట్లో స్లిప్పులు అందజేసిందన్నారు. ఆయా భూముల్లో జీడి,మామిడి తోటలు సాగుచేసి కొన్నాళ్ల జీవనోపాధి పొందామని రైతులు అంటున్నారు. ఆ భూములకు కొంతమంది కన్నుపడడంతోపాటు, అధికారికంగా అభివృద్ధి పనులు, సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ యంత్రాంగం ఇపుడు సర్వే చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గతంలో తమ అధీనంలో ఉన్న భూములను తమ పేరిట నమోదు చేసి పట్టాలు ఇవ్వాలని తర్లువాడ వాసులు కోరుతున్నారు. సర్వేలో ఇతర పేర్లు నమోదు చేసి పట్టాలు జారీకి యత్నిస్తున్నట్లు సమాచారంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోగతంలో డిఆర్‌డిఎ ఇచ్చిన భూములకు సంబంధిత రైతులకు పరిహారంతోపాటు ఇళ్లస్థలాలను కేటాయించాలనికోరుతున్నారు.

ఈ విషయమై అధికారులను సంప్రదించగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ముందుగా సర్వే నిర్వహిస్తున్నామని, డి పట్టా ఉన్న వారిని భూములను గుర్తిస్తున్నామన్నారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సిఐటియు పోరాట విజయం

సమ్మె ఒప్పందాల అమలుపై విశాఖ డెయిరీ కార్మికుల హర్షం

మాట్లాడుతున్న యూనియన్ నేత రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -గాజువాక : సిఐటియు పోరాట ఫలితంగా విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కారమై, నేడు కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందని విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు మాజీ అధ్యక్షులు ఎన్ రాజేంద్రప్రసాద్ అన్నారు. గతేడాది డిసెంబర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేయగా, 20 డిమాండ్లలో 19 అమలుకు అప్పట్లో విశాఖ డెయిరీ యాజమాన్యం లిఖితపూర్వకంగా అంగీకరించింది. అయితే చేసుకున్న ఒప్పందాల అమలుకు తర్వాత కూడా యూనియన్ తరపున పోరాటం కొనసాగించడంతో బుధవారం నుంచి అవన్నీ కార్యరూపంలోకి వచ్చాయని రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

కనీస వేతనం రూ.21వేలు, బేసిక్ ఐఆర్ఎఫ్ ఏడు శాతం, ఫిక్స్‌డ్ డిఎ ఐదు శాతం, హెచ్ఆర్ఏ 15శాతం, ఒప్పంద కార్మికులు 426 మందిని పర్మినెంట్ చేయడం, బల్క్ కోల్డ్ ఆపరేటర్లకు వారాంతపు సెలవు, 8 గంటల పని దినాలు, ఓటీ సదుపాయం, అర్హత కలిగిన ఉద్యోగులకు 50శాతం ప్రమోషన్ కల్పన, 2005 ఏప్రిల్ ఒకటి నుంచి ఎల్‌పిసి అమలు, ఏడాదికి 25 చొప్పున ఇఎల్‌లు, సిఎల్‌లు, పది సిగ్గు సెలవులు, ఉద్యోగ విరమణ వయస్సు 58 నుంచి 60ఏళ్లకు పెంపు, విధుల్లో చనిపోయిన వారికి నష్టపరిహారం చెల్లింపు వంటి ఒప్పందాలన్నీ బుధవారం నుంచి యాజమాన్యం కార్యరూపంలోకి తెచ్చిందన్నారు చేసుకున్న ఒప్పందాలన్నీ అమలు చేయడంపై డెయిరీ యాజమాన్యానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కె వరాహమూర్తి, సతీష్ కుమార్ నారాయణ, కె.జగదీశ్వరరావు, ఆ అప్పారావు, కెవన్ వెంకట్రావు, ఎల్‌విఎం నాయుడు పాల్గొన్నారు.

ఎంఎం బ్రదర్స్‌లో దుస్తులపై 30శాతం రాయితీ

ఎంఎం బ్రదర్స్ వస్త్రదుకాణంలో ముస్తాకిమ్

ప్రజాశక్తి- విశాఖపట్నం : గవర కంచరపాలెంలోని ఎంఎం.బ్రదర్స్ వస్త్ర దుకాణంలో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా అన్ని దుస్తులపై 30శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు దుకాణ యజమాని ముస్తాకిమ్ తెలిపారు. బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ, తమ కస్టమర్లకు తక్కువ ధరల్లో పలు రకాల చుడీదార్, పంజాబ్ డ్రెస్సులు, బ్లౌజులు, చీరలు, కాటన్ దుస్తులు, కంచి పట్టుచీరలను విభిన్న డిజైన్లలో అందుబాటులో ఉన్నాయన్నారు వస్త్రాల నాణ్యత, మన్నికలో ఇప్పటికే వినియోగదారుల్లో తమ దుకాణానికి ఒక నమ్మకం ఉందని, దాన్ని నిలబెట్టుకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నా మన్నారు. రూ.500 ప్రారంభ ధర నుంచి లభించే పండుగ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యూబా సహాయార్థం నిధి వసూలు

భెల్ గేటు వద్ద నిధి వసూలులో సిఐటియు నేతలు

ప్రజాశక్తి - గాజువాక : సిఐటియు కేంద్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం భెల్ మెయిన్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలోక్యూబా సహాయార్థం కార్మికులు, ఉద్యోగుల నుంచి నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటివి.ప్రకాశ్ మాట్లాడుతూ, అమెరికా ఖండంలో ఏకైక సోషలిస్టు దేశం క్యూబాపై సామ్రాజ్యవాద అమెరికా అనేక ఆంక్షలు, ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 1.2 కోట్ల జనాభా ఉన్న క్యూబాలో 1991 తర్వాత అమెరికా ఆంక్షలతో పసిబిడ్డలకు పాలపొడి, ఆహారం, మందులు అందకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్ జగన్నాధరావు, కె విజయ్‌కుమార్, కె నారపరెడ్డి, అల్లి అప్పలనారాయణ, సిహెచ్ మురళీశ్వరరావు, జి అచ్చన్న నాయుడు, ఎస్ అప్పారావు, జె సత్యనారాయణ పాల్గొన్నారు.

అపోలోలో కోల్‌ఫిట్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ :కొలొరెక్టల్ (పెద్దపేగు) కేన్సర్‌ను ముందుగా గుర్తించి, నివారించేందుకు వీలుగా అత్యాధునిక కొలొరెక్టల్ కేన్సర్ స్క్రీనింగ్ కోల్‌ఫిట్ పరీక్షవిభాగాన్ని ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో బుధవారం ప్రారంభించారు. బుధవారం అపోలో ఆసుపత్రి సమావేశ మందిరంలో మీడియాతో అపోలో సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ కొలొరెక్టల్ కేన్సర్ పెద్ద వయసు వారికి మాత్రమే వచ్చే వ్యాధిగా ఒకప్పుడు భావించేవారని, ఇప్పుడు యువకులలో సైతం ఈ వ్యాధి ప్రబలడం విచారకరమన్నారు. అపోలో సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీ డాక్టర్ సుమన్ దాస్ మాట్లాడుతూ కొలొరెక్టల్ ఫిట్, కొలొనోస్కోపితో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రీకేన్సర్ పాలిప్‌లను గుర్తించి అవి కేన్సర్‌గా మారక ముందే తొలిగించవచ్చన్నారు.అపోలో కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజీ డాక్టర్ మెంట్రపాలెటి ప్రదీప్ మాట్లాడుతూ ఆధునాతన వైద్య నైపుణ్యం, రోగనిర్ధారణ సాంకేతికతను వినియోగంతో ముందస్తు వ్యాధుల గుర్తింపు ద్వారా తగు వైద్యంలో ప్రాణాలను కాపాడ వచ్చన్నారు.



కోల్‌ఫిట్ విభాగాన్ని ప్రారంభిస్తున్న అపోలో వైద్యులు

ప్రశాంతంగా టెన్త్ ఫిజిక్స్ పరీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : బుధవారం జరిగిన పదోతరగతి ఫిజిక్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 29,405 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 29,247 మంది హాజరయ్యారు. 158 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లాలో 15 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్ర పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు. 837 మంది విద్యార్థులకుగాను 750 మంది హాజరుకాగా, 87 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. జిల్లా అబ్జర్వర్ దేవానంద రెడ్డి ఐదు కేంద్రాలను, తాను 4 పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 26 కేంద్రాలను తనిఖీ చేసినట్టు తెలిపారు.

12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం నియమించవలసిన 12వ పిఆర్‌సి కమిషన్‌కు చైర్మన్‌ను 2023 జులై 1 నుండి ఎంతవరకు నియమించలేదని వెంటనే చైర్మన్‌ని నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా యూటీఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం 12వ పిఆర్సి చైర్మన్ నియమించి ఎలాంటి విధివిధానాలు రూపొందించకపోవడంతో ఆయన రిజైన్ చేసి వెళ్లిపోయారని గుర్తు చేశారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు 12వ పిఆర్సి చైర్మన్ నియమించలేదన్నారు. తక్షణం చైర్మన్‌ని నియమించడంతో పాటు ఐఆర్ 29 శాతాన్ని ప్రకటించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పాత బకాయిలో ప్రభుత్వం 7వేలు చేసినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నారు. ఈ బకాయిల్ని కూడా ప్రతినెల చెల్లించడానికి రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను, ప్లస్ టు పాఠశాలలను, ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియాల్ని కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రక్షణ, ఆర్థిక సమస్యలపై ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు శ్రీకాకుళం కేంద్రంలో మార్చి 31న జరుగుతుందని, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటరావు, సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, జిల్లా కార్యదర్శులు జీఎస్. ప్రకాష్, ఎన్.శేషు కుమార్, మాకిరెడ్డి రాజనాయుడు, రమేష్ రావ్, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, ఎంవి. అప్పారావు, గేదెల శాంతి దేవి, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి రాష్ట్ర సచివాలయంలో జరిగిన 3వ కలెక్టర్ల సమావేశంలో రెండవ రోజు బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ అనకాపల్లి జిల్లా అభివృద్ధి ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రానున్న కాలంలో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ పర్ కేపిటా ఇన్‌కంలో విశాఖ ప్రథమ స్థానంలో ఉండగా, అనకాపల్లి జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడం హర్షనీయమన్నారు.

ఆస్తి పన్ను పెంపును నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తాము అధికారంలోకి వస్తే ఆస్తి పన్నును సమీక్షిస్తామని ఎన్నికలలో చేసిన హామీలను కూటమి ప్రభుత్వం మరిచిపోతే ఎలా అని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. ఆస్తి పన్ను పెంపును నిలుపుదల చేయాలని కోరుతూ బుధవారం జీవీఎంసీ జోనల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద సృష్టించడం అంటే ప్రజలపై భారం మోపడమా అని ప్రశ్నించారు. మే నెల ఆఖరి వరకు పెనాల్టీ లేకుండా పన్నులు చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్నియాదవ్, కొన్ని చిన్న అప్పారావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, వాసుపల్లి తాతయ్యలు, కొల్లి సత్యారావు, అప్పారావు పాల్గొన్నారు.

మోటివేషన్ స్పీకర్ ఫల్గుణరావుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-పరవాడ : సికింద్రాబాద్‌లోని హెరిటేజ్ మినెర్వా గ్రాండ్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకి చెందిన వ్యక్తులకు నైపుణ్యతకు సంబంధించి మార్చి 22, 23 తేదీలలో రెండు రోజులు నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాకకు చెందిన ఏపి ట్రాన్స్‌కో 400 కెవి సబ్ స్టేషన్‌కు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగిరి ఫల్గుణరావు ప్రతిభ చూపించారు. ఈ మేరకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపగత అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు, ప్రముఖ నటుడు ప్రదీప్ కుమార్ చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ ప్రశంసా పత్రాన్ని ఫల్గుణరావు అందుకున్నారు.

ఎన్‌టిపిసిలో కమ్యూనికేషన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రిలో ఆర్ఎల్ఐ శాఖ సమన్వయంతో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం కమ్యూనికేషన్ వర్క్‌షాప్ ఈ నెల 25న నిర్వహించింది. దీనిని ముఖ్య అతిథి సింహాద్రి ఈడి సమీర్ శర్మ, పీకే సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. అధికారులు, వాటాదారులతో సమర్థవంతమైన నిశ్చితార్థం కోసం కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడం ఈ వర్క్‌షాప్ లక్ష్యమని తెలిపారు. 'మౌఖిక, రాతపూర్వక వ్యాపార సంభాషణల ముఖ్యమైన అంశాలు' అనే అంశంపై దృష్టి కేంద్రీకరించారు. విశాఖపట్నం ఐఐఎమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత టి ఇంటరాక్టివ్, కార్యాచరణ ఆధారిత సెషన్‌లను సులభతరం చేశారు. కార్యక్రమంలో జీఎం జెనా, ఎస్ పద్మప్రియ, జీఎమ్‌విటి కాంబ్లే, హెచ్ఆర్ హెడ్ బిబి పాత్ర, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, కార్పొరేట్ కమ్యూనికేషన్ బృందం పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు వచ్చే రోగుల సంఖ్య, అవసరమైన బెడ్లు, 105 రకాల మందులు వంటి వాటిపై వైద్యాధికారి డాక్టర్ కె శ్రావ్యను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం కారణంగా తరచూ కరెంటుకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా ఐఎల్ఆర్ డీప్ ఫ్రెజర్ మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. ఒక నెలలో ప్రసవాలు జరుగుతున్నాయో అడిగారు. సిబ్బంది పనితీరును అభినందించారు. సిహెచ్ఓ వేణుగోపాల్ ల్యాబ్ టెక్నీషియన్ గీతారాణి, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధి నరసింగపల్లి సబ్ స్టేషన్ పనులు కారణంగా గురువారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, ఎన్‌జి పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, గొల్లగూడెం, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కోత అచ్చెర్ల, మొసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

28న కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మండలంలో 28 యూనిట్లకు కార్పొరేషన్ రుణాలు అందించడానికి బ్యాంకులు ముందుకు వచ్చాయని ఎంపిడిఓ కొండలరావు, సూపరింటెండెంట్ ప్రసాదరావు బుధవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వీటిలో బిసి కార్పొరేషన్ 20 యూనిట్లకు, ఈబిసి కార్పొరేషన్‌కు 2 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 2, కమ్మ కార్పొరేషన్‌కు 1, రెడ్డి కార్పొరేషన్‌కు 2, వైశ్య కార్పొరేషన్‌కు 1 మంజూరైనట్లు పేర్కొన్నారు. కెనరాబ్యాంకు (మామిడివాడ) 6 యూనిట్లకు, ఐఓబి (నక్కపల్లి) 8 యూనిట్లకు, స్టేట్‌బ్యాంకు (ఏటికొప్పాక) 5 యూనిట్లకు, స్టేట్‌బ్యాంకు (పెనుగొల్లు) 9 యూనిట్లు మంజూరు చేశారన్నారు. ఒక్కో యూనిట్‌కు మంజూరయ్యే రూ.9.72 లక్షల్లో సగం కార్పొరేషన్లు భరిస్తాయని చెప్పారు.

గ్రీన్‌ఎనర్జీ, ఎఐపై విద్యార్థులు పట్టు సాధించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై పట్టు సాధించాలని, తద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని ఐఈఈఈ చైర్, డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డాక్టర్ వి.సందీప్ సూచించారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, ఐఈఈఈ, ఐఎస్‌టిఈ ప్రొఫెషనల్ బాడీ సంయుక్త భాగస్వామ్యంతో "నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రికల్ సైన్సెస్-2025" జాతీయ సదస్సు ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా డాక్టర్ వి.సందీప్ ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా స్మార్ట్ గ్రిడ్స్, మైక్రో గ్రిడ్స్, ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఐ.ఈ.ఈ.ఈ ప్రపంచంలోనే ఉన్నతమైన సంస్థ అని డైట్ కళాశాలలో ఐ.ఈ.ఈ.ఈ చాప్టర్ చాలా చురుకుగా ఉంటూ అనేక సాంకేతిక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠ రావు మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలోని అనేక ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి 300 పైగా పరిశోధన పత్రాలు రాగా అందులో 196 పరిశోధన పత్రాలను వాటి నాణ్యతను ఆధారంగా తీసుకొని ప్రచురించడానికి ఎంపిక చేసామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ గోపాలమ్మ, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కన్వీనర్ డాక్టర్ రమణ కుమార్ జోగ, డీన్ అకాడమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబిక ఉత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 28 నుండి ఏప్రిల్ 27వ తేదీ వరకు జరిగే శ్రీనూకాంబిక అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు) విజ్ఞప్తి చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న అమ్మవారి జాతర, 29న కొత్త అమావాస్య ఉత్సవం, 30న ఉగాదితో పాటు నెల రోజుల పాటు (ఏప్రిల్ 27 వరకు) ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అమ్మవారి ఆలయంలో చలువ పందిళ్ళ వేశామని, ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను మంత్రి అందజేస్తారని తెలిపారు. అమ్మవారి ఉత్సవంపై స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నెలరోజులు పాటు జరుగుతాయన్నారు. ఉత్సవ నిర్వహణ అధికారి శోభారాణి, కార్యనిర్వహణ అధికారి వెంపలి రాంబాబు మాట్లాడుతూ పోలీస్ పికెట్, మెడికల్ క్యాంపు ఆలయంలో ఏర్పాటు చేస్తున్నామని, తాగునీరు, మరుగుదొడ్ల మెరుగుపర్చామని చెప్పారు. సమావేశంలో ధర్మకర్తలు రవికుమార్, సతీష్, ఆనంద్, కాండ్రేగుల జగ్గారావు, మారిశెట్టి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌కు నూకాంబిక జాతర ఆహ్వానం

అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి జాతరకు రావాల్సిందిగా విజయవాడలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు, ఇతర శాసన సభ్యులకు అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం ఆహ్వానం పలికారు.

స్పీకర్‌కు ఆహ్వానం అందిస్తున్న దృశ్యం

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టీడీపీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఆ పార్టీ సభ్యత్వ కార్డులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ బుధవారం వివిధ గ్రామాలకు పంపిణీ చేశారు. మండలంలోని వడ్డాది, లోపూడి, లోపూడి సింగవరం తదితర గ్రామాల నాయకులకు ఈ కార్డులను అందజేశారు. ఈ కార్డులను సభ్యులకు వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి వడ్డాది టౌన్ అధ్యక్షులు దొండ నరేష్, తలారి శంకర్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, కుబిరెడ్డి వెంకట్రావు, దొండ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల బాక్స్ అందిస్తున్న గేదెల సత్యనారాయణ

అయ్యన్నలో ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : అయ్యన్న విద్యా సంస్థల యాజమాన్యం రంజాన్ పండగను మత సామరస్యానికి ప్రతీకగా తమ విద్యా సంస్థల ప్రాంగణంలో బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, నూర్జహాన్ దంపతులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో సర్వమతాల పండగలను సమభావంతో వేడుకగా చేస్తున్నట్లు చెప్పారు. రంజాన్ విశిష్టతను, నెల రోజుల పాటు ముస్లిములు పాటించే ఉపవాస ప్రాముఖ్యత గురించి ముస్లిం విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఇఫ్తార్ విందులో భాగంగా ఖర్జూరాలను, సేమియా పాయసాలను పంపిణీ చేశారు. విద్యార్థులందరూ ఎంతో ఆసక్తి, ఉత్సాహంతో "ఈద్ ముబారక్" అని చెబుతూ పరస్పరం అలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చౌడువాడ సర్పంచ్ ఎరుకునాయుడు

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శిక్షణ కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. మండలానికి చెందిన క్లాస్ మిత్రులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ విస్తరణ అధికారులకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడువాడ సర్పంచి దాడి ఎరుకునాయుడు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు కూడా ఆరోగ్యవంతంగా ఉంటారని, దీంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గతంలోని చంద్రబాబు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి జి.రమణి, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు. ట్రైనీ జె.చినబాబు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్లాస్ మిత్రులు పాల్గొన్నారు.

నేటి ఎంపిపి ఎన్నికకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగనున్న ఎంపీపీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి ఎస్.మంజులవాణి తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, ఇందుకోసం తహశీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసులకు నివేదిక పంపడం జరిగిందని చెప్పారు. బీసీ వర్గానికి చెందిన మహిళను ఎంపీపీగా చేతులెత్తి ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎన్నికైన ఎంపీపీ ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. ఈ ప్రక్రియ అంతా సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ సమక్షంలో జరగనుందని పేర్కొన్నారు.

నేడు వైస్ ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండల వైస్ ఎంపీపీ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ప్రిసైడింగ్ అధికారి కే రాజేశ్వరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరై ఎన్నికకు సహకరించాలని ఆమె కోరారు.

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని సిపిఎం నాయకులు ఎంపీడీవో విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు 8 వారాల నుంచి కూలి డబ్బులు చెల్లించలేదని, దీంతో వారు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ 200 పనిదినాలు కల్పించాలని, రోజు కూలీ రూ.600 చెల్లిచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలు గాయపడితే మెడికల్ ఖర్చు ప్రభుత్వమే ఇవ్వాలని, పనిముట్లు, వేసవి అలవెన్స్ చెల్లించాలని, ప్లే సిప్పులు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 8 వారాల వేతన బకాయిలు చెల్లించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్వీ నాయుడు, పి.సాంబశివరావు, ఈశ్వరరావు, పొట్నూరు అప్పారావు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

చోడవరం సుగర్స్

రైతులకు బకాయిలు, కార్మికులకు జీతాలు చెల్లించాలి

కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

చోడవరం సహకార సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెరుకు బిల్లులు, కార్మికులకు జీతాలు చెల్లింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు బుధవారం కలెక్టర్కు లేఖ రాశారు. జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేశాక, చెరకు రైతుకు పెద్ద దిక్కుగా చోడవరం సహకార సుగర్ ఫ్యాక్టరీ వుందని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీని నమ్ముకొని చెరకు సాగుచేసి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభం నుంచి నేటి వరకు చెరకు సరఫరా చేసిన రైతుకు యాజమాన్యం ఒక రూపాయి కూడా చెల్లించలేదని, దీంతో కుటుంబ అవసరాలకు, పెట్టుబడులకు వడ్డీలకు అప్పులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది బకాయి రూ.7.16 కోట్లు, ఈ ఏడాది బకాయి బిల్లు రూ.25.14 కోట్లు రైతులకు చెల్లించాల్సివుందని పేర్కొన్నారు. కార్మికులకు రూ.7 కోట్లు జీతం బకాయివుందని, ఈ ఏడాది ఫ్యాక్టరీ క్రషింగ్ ఆరంభం నుంచి కార్మికులకు జీతం చెల్లించలేదని తెలిపారు. తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులు, కార్మికుల బకాయి బిల్లులు, జీతాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీలో రూ.17 కోట్ల విలువైన పంచదార నిల్వలు, రూ.8 కోట్లు విలువైన మొలాసిస్ విక్రయానికి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

హైకోర్టు తీర్పు ప్రకారం వంగలి వ్యవసాయ కూలీలకు

ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి చోడవరం

సబ్బవరం మండలం వంగలి పెట్రోలియం యూనివర్సిటీ భూసేకరణకు సంబంధించి హైకోర్టు తీర్పు ప్రకారం వ్యవసాయ కూలీలకు కూడా పునరావాస ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంగలి పెట్రోలియం యూనివర్శిటీ భూసేకరణ కేసును విచారించిన జస్టిస్ రావు రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడి హైకోర్టు డివిజన్ బెంచ్ భూసేకరణ వల్ల ఉపాధి నష్టపోయిన వ్యవసాయ కూలీలకు కూడా పునరావాస చట్టం ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందించాలని శుక్రవారం కీలక తీర్పు ఇచ్చిందని వెంకన్న తెలిపారు. కేవలం పరిహారం ఇచ్చామని చెబితే సరిపోదని పునరావాస చట్టం కింద అందే ప్రతి ప్రయోజనం వ్యవసాయ కార్మికులకు కూడా ఇచ్చి తీరాలని హైకోర్టు స్పష్టం చేసిందని వెల్లడించారు. 2013 భూసేకరణ చట్టంలో నిర్దేశించిన విధంగా ఆర్ఆర్ ప్యాకేజీ అమలుకు అవసరమైన ఉత్తర్వులను నాలుగు వారాల్లోగా ప్రభుత్వం జారీ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. డి-ఫాం పట్టాలు లేకుండా భూమిని సాగు చేసుకునే వాళ్ల కూడా 2013 భూసేకరణ చట్ట నిబంధనల ప్రకారం పునరావాస ప్రయోజనాలను కల్పించాలని, ఈ చట్టం కింద చెల్లించాల్సిన ఇతర పరిహారాలను వడ్డీతో చెల్లించాలని తీర్పు చెప్పినట్లు తెలిపారు. అసైన్డ్ భూములకు ఎకరాకు రూ.13 లక్షలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూమినే నమ్ముకున్న వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయిన నేపథ్యంలో పునరావాస ప్యాకేజీ ప్రయోజనాలు కల్పించాలని కోరారు.

పట్టపగలు బంగారు ఆభరణాలు అపహరణ

క్లూస్ టీమ్ రంగంలోకి దిగడంతో వస్తువులు వదిలి వెళ్లిన దొంగలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని పిఎస్.పేటలో బుధవారం పట్టపగలు బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనిపై రెండు గంటల్లోనే పోలీసు క్లూస్ టీం రావడంతో భయపడిన దొంగలు బంగారు వస్తువులను వదిలి వెళ్లారు. స్థానిక ఎస్ఐలు నాగకార్తీక్, బంగారు రాజు అందించిన వివరాలు ప్రకారం... మండలంలోని పిఎస్.పేట గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మి సత్యనారాయణ బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో తన ఇంటికి తాళాలు వేసుకొని పొలంలోకి వెళ్లారు. తిరిగి ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి తన ఇంటిలో పెట్టిన 2 పేటల బంగారు పుస్తులతాడు (3 తులాలు), నల్లపూసల దండ (2 తులాలు) మొత్తం 5 తులాల బంగారు వస్తువులను ఎవరో అపహరించారు. దీనిపై చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ బి.నాగకార్తిక్ కేసు నమోదు చేసి, పోలీస్ సిబ్బంది, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి దర్యాప్తు చేపట్టారు. దీంతో భయపడిన దొంగలు సదరు వస్తువులను తెచ్చి బాధితుని ఇంటిలో పడేసినట్లు ఎస్ఐలు తెలిపారు.

టిడిపి కార్యకర్తల సమస్యలపై గ్రీవెన్స్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యలపై అచ్యుతాపురంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, నియోజవర్గ పరిశీలకులు బోండా జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కార్యకర్తల కోసం మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. టిడిపి నాయకులు కర్రి సాయికృష్ణ, ధూళి రంగనాయకులు, భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, జనపరెడ్డి నరసింగరావు, దాడి ముసలినాయుడు, కులుకులూరి విజయబాబు, నీరుకొండ నర్సింగరావు, పొనమల్ల కొండబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లిలో టిడిపి కార్యకర్తల సమస్యలపై బుధవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణులు తమ సమస్యలను తెలియజేశారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, టిడిపి నాయకులు బిఎస్ఎంకె.జోగినాయుడు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తేగాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపల్ దొండా చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 8, 9, 12వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీకి కూడా కూడ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. https://apkgbv.apcfss.in సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామపంచాయతీ పరిధి శ్రీబంగారమ్మ, మరిడమాంబ అమ్మవారి గుడికి వెళ్లే రోడ్డుకు కల్వర్టు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. పరవాడ జడ్పిటిసి పిఎస్ రాజు, సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నిధులు, పంచాయతీ నిధులతో మాలపల్లి గెడ్డ వాగుపై ఈ కల్వర్టు నిర్మాణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు రొంగలి నాయుడు, వార్డు నెంబర్ పైల మాధురి అప్పారావు, పోలిరెడ్డి వెంకట్రావు పాల్గొన్నారు.

ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలి

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : చోడవరం పంచాయతీ పరిధి ఐటిఐ కాలనీలో ఇళ్ల పై నుండి ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే తొలగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఐటిఐ కాలనీలో ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను బుధవారం సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఇంటి పై నుంచి కరెంటు లైన్ ఉండడం వల్ల అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో చాలా సందర్భాల్లో విద్యుత్ అధికారులకు తెలియజేసినా నేటికీ వాటిని తొలగించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఇళ్లపైన ఉన్న కరెంటు వైర్లను తొలగించకుంటే విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పొట్నూరు అరుణ, జలగడుగుల అప్పారావు, రాకేష్, దేవి పాల్గొన్నారు.

యలమంచిలిలో 'జనవాహిని'

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ 'జనవాహిని' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పలువురు తమ సమస్యలపై వినతులు అందించారు. దాదాపు 3 గంటల్లో 300 వినతులు వచ్చాయని ఎమ్మెల్యే సందరపు విజయకుమార్ ప్రకటించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అచ్యుతాపురం, రాంబిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి ప్రాంతాల్లో కంపెనీలు వెల్లువలా క్యూ కడుతున్నాయని, అక్కడ పనిచేసేవారికి నివాసయోగ్యంగా యలమంచిలి రూపొందబోతోందని చెప్పారు. కాలుష్య రహిత ప్రాంతంగా అభివృద్ధి చెంది విశాఖ అరిలోవ మాదిరిగా 'మెడికల్ హబ్'గా మారుతుందని తెలిపారు. స్థలం ఎంపికైతే ఇక్కడ దాదాపు 20 నుంచి 30 ఆసుపత్రులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీనివాసరావు, అన్నం బాబ్జి, ఇత్తంశెట్టి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి చెరుకు రైతులకు పేమెంట్లు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు రూ.3వేలు చొప్పున గురువారం నుండి బట్వాడా చేయనున్నామని ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 సీజనుకు గాను జనవరి 21 నుండి ఫిబ్రవరి 4వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన 3123 మందికి 5 కోట్ల 84 లక్షల రూపాయలను నేరుగా వారి వారి ఖాతాలలో షెడ్యూల్ ప్రకారం జమ చేస్తామని పేర్కొన్నారు. తదుపరి క్రషింగ్ జరిపిన చెరుకుకు దశలవారీగా పేమెంట్ అందిస్తామన్నారు.

ఉపమాకలో మసాలా ఘుమ..ఘుమలు...

మసాలాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక తీర్థంలో మసాలా ఘుమ ఘుమ లాడుతోంది. ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా జరుగు తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకం. స్వామి వారి ఉత్సవాలు ఈనెల 9 న ప్రారంభమై 17 వ తేది రాత్రితో ముగిసాయి. ప్రతీ ఏటా స్వామి వారి ఉత్సవాలు సందర్భంగా కొత్త అమావాస్య ముందు రోజు వరకు (18 రోజుల పాటు) తీర్థ జరుగుతుంది. తీర్థంలో మసాలా దినుసులు, పిల్లల ఆట వస్తువులు, గృహోపకర సామగ్రి, గాజులు, ఫ్యాన్సీ పావులతో పాటు తినుబండరాలకు సంబంధించి తోపుడు బండ్లపై ఖర్జూరం, శెనగపప్పు, ద్రాక్ష వంటివి విక్రయిస్తారు. తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకమనే చెప్పాలి. పసుపు, కుంకం, జీల కర్ర, ధనియాలు, యాలికలు, దాల్చిన చెక్క, లవంగాలు, గసగసాలు, అవాలు, ఫలావు సామగ్రి, వెల్లుల్లి పాయలు, ఎండు మిర్చి తదితర సుగంధ ద్రవ్యాలను వ్యాపారులు విక్రయిస్తుటారు. సుగంధ ద్రవ్యాలు అమ్మకాలకు వ్యాపారులు సుమారుగా 20 షాపులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

విశాఖ ఏజెన్సీ ప్రాంతంతో పాటు, ఉత్తరాంధ్ర, కాకినాడ జిల్లాల్లో పలు గ్రామాల నుంచి జనం తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, ఏడాది పొడువునా సరిపడే మసాల దినుసులు కొనుగోలు చేసుకుని తీసుకువెళ న్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో గల మండలాలతో పాటు నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి, చోడవరం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు వచ్చి మసాలా దినుసులు కొనుగోలు చేసుకుంటున్నారు. మసాలా దినుసులు కొనుగోలు చేసుకుని పెద్ద పెద్ద మూటలతో తీసుకు వెళ న్నారు. చాలా మంది భక్తులు సెంట్ మెంట్ గా భావించి ప్రతీ ఏటా ఉపమాక తీర్థంలో మసాలా దినుసులు తప్పనిసరిగా కొనుక్కొని ఇళ్లకు తీసుకు వెళ్ళడం

బస్తాల్లో మోసుకెళుతున్న మహిళలు

అనవాయితీగా వస్తుంది. మసాలా దినుసులన్నీ ఒకే చోట లభించడంతో దుకాణాలు వద్ద జనం క్యూ కపడు తున్నారు . దీంతో మసాలా దినుసుల దుకాణాలు జనం రద్దీతో కిటకిటలాడుతున్నాయి. జాతర సందర్భంగా కోట్లాది రూపాయుల మసాలా దినుసుల వ్యాపారం సాగుతుంది. ఉపమాకలో తీర్థం సందర్భంగా వివిధ రకాల షాపులు వ్యాపారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈనెల 27 తేదీతో తీర్థం ముగుస్తుంది. వివిధ గ్రామాల నుండి పలువురు కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి తీర్థంలో సరదాగా గడపడానికి తరలివస్తున్నారు. దీంతో తీర్థంలో జన సందడి నెలకొంది.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

తడి, పొడి చెత్త సేకరణ పై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి: గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద రెండవ రోజు బుధవారం పాయకరావుపేట మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. తడి పొడి చెత్త సేకరణ పై ముందుగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటా డస్ట్ బిన్నుల ద్వారా తడి పొడి చెత్తను సేకరించే విధానం, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి చేయాల్సిన ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, పాయకరావుపేట ఇపిఓపిఆర్డి చంద్రశేఖర్, నక్కపల్లి మండల ఇన్చార్జి ఇపిఓపిఆర్డి శ్రీను పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

తహశీల్దార్‌కు టిడిపి నేతల సన్మానం

ప్రజాశక్తి-చీడికాడ: ఇటీవలన నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ కిషోర్ లింకన్ ను మండల టిడిపి నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చీడికాడ మండలానికి చెందిన రెడ్డి రాము, పంచాడా దాలినాయుడు, బీల్ల కోటి, గండి ముసలి నాయుడు, డివి రమణ, రెడ్డి సన్యాసినాయుడులతో పాటు పలువురు నేతలు తహసిల్దార్ ను కలిసి మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసిల్దార్‌ను సత్కరించారు.

అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు

ప్రజాశక్తి-కొత్తకోట: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి అధికారులతో పాటు, ప్రజల మన్ననలు పొందాలని కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు తెలిపారు. కొత్తకోట సర్కిల్ పరిధిలో ఇటీవల ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన 17 మంది సిబ్బందికి కొత్తకోట స్టేషన్ ఆవరణలో మంగళవారం రాత్రి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగికి బదిలీ అనేది సహజమన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అధికారుల వద్ద గుర్తింపు పొందాలన్నారు. అనంతరం బదిలీ పై వెళ్లిన ఉద్యోగులకు సీఐతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్సై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట, రోలుగుంట,

మాట్లాడుతున్న సిఐ కోటేశ్వరరావు

రావికమతం, బుచ్చెయ్యపేట ఎస్సైలు శ్రీనివాస్, రామకృష్ణ, రఘువర్మ, శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు..

మాట్లాడుతున్న కౌన్సిలర్ రాజేష్

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో బుధవారం స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా కు విశేష స్పందన లభించింది. ఈ మెగా జాబ్ మేళాలో 18 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనగా 985 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యారు. 338 మంది వివిధ కంపెనీలకు ఎంపిక కావడం జరిగినదని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 25వ వార్డ్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు, రిషి కాలేజ్ కరెస్పాండెంట్ కోన సతీష్ పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజి అధ్యాపకులు త్రినాథ్‌కు డాక్టరేట్

డాక్టరేట్ పత్రాన్ని స్వీకరిస్తున్న త్రినాథ్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక అల్లూరి సీతారామ రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న బల్ల త్రినాథ్ ఆంధ్ర యూనివర్సిటీ నుండి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులకు బుధవారం తెలియజేశారు. ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ద మైక్రోస్ట్రక్చర్ ఎలక్ట్రికల్ అండ్ మ్యాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్, క్రోమియం, అల్యూమినియం సబ్స్టిట్యూట్ కోబాల్ట్ కాపర్ ఫేరైట్ అనే థీసిస్ పై భౌతిక శాస్త్ర విభాగంలో పరిశోధనలకు గాను ఆంధ్ర యూనివర్సిటీ నుండి పిహెచ్‌డి ప్రధానం చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాజు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం గ్రామానికి చెందిన మేకల రత్నం రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. ఈనెల 21న ఉద్దండ పురంలో హైవే జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా నక్కపల్లి వస్తున్న బైక్ ఢీకొనడంతో మేకల రత్నం తీవ్రంగా గాయపడింది. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ వెల్లడించారు.

పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలో దిబ్బిడి గ్రామంలో మండల పరిషత్ నిధులతో ఆకుల వారి కల్లాల వద్ద తాగునీటి బోర్‌ను ఏర్పాటు చేశారు. . రైతులకు కల్లాల వద్ద తాగునీటి సమస్యలు ఎదురవుతుండడంతో తాగునీటి బోర్‌ను మంజూరు చేశారు. వడ్డాది, గంటికోర్లం గ్రామాల్లో తాగునీటి బోర్లు ప్రారంభించారు. ఈ బోరును వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాసరావు, దొండా నరేష్, బాబురావు, పాల సంఘం అధ్యక్షులు ముమ్మన సూర్యనారాయణ, ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, ముమ్మిన నాగరాజు, పెద్ది రెడ్ల రాజు, సేనాపతి శ్రీనివాసరావు, సూతపల్లి సర్వేశ్వరరావు, ఆకుల ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారుల మరమ్మతు పనులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల కసింకోట బంగారు మెట్ట రోడ్లో గత రెండు రోజులుగా రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నారు. గతంలో కసింకోట-బంగారు మెట్ట రోడ్డును విస్తరించడంతో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు రద్దీ ఎక్కువైంది. మాడుగుల, పాడేరు, తదితర ప్రాంతాలకు చెందినవారు అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు సైతం ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల సైతం రాకపోకలు సాగిస్తుండడంతో దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర ప్రాంతాల్లో రోడ్డు గుంతలు పడింది. దీంతో వాహనదారులు కాస్త ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ రహదారి మరమ్మతులు చేస్తుండడంతో ప్రయాణికులు, పలువురు వాహనదారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

చేపడుతున్న మరమ్మతు పనులు

రీ సర్వే పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-చీడికాడ: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రీ సర్వే ఎంతో ఉపయోగ పడుతుందని తహసిల్దార్ కిషోర్ లింకన్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. భూ సరిహద్దులు గుర్తించడంతో పాటు రికార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు వంటివి పరిష్కరించుకునేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్, సర్పంచ్ కొల్లి సూర్య నారాయణ, ఉప సర్పంచ్ కొల్లి పైడునాయుడు, సచివాలయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న అధికారులు, నేతలు

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి -గాజువాక: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరుతూ జివిఎంసి 73వ వార్డు సచివాలయం వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో ఇళ్లు, పింఛన్లు, ఇతరత్రా సమస్యలపై ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని, ఆయా సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాటం చేస్తుందన్నారు ఇందులో భాగంగా వచ్చేనెల 8న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఎ.లోకేష్, ఎల్ బంగారునాయుడు, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత, హేమలత పాల్గొన్నారు.

ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

సీతమ్మధార ఆందోళనలో మాట్లాడుతున్న గంగారావు

మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి

సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు ఆర్కేనగర్‌లో మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సీతమ్మధార జివిఎంసి తాగునీటి సరఫరా విభాగం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ అర్హులందరికీ వెంటనే జివింఎసి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వాటర్ వర్క్స్ విభాగం ఎఇతో ఫోనులో మాట్లాడి సమస్యను వివరించగా, రెండు వారాల్లో పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు కార్యక్రమంలో జిల్లా నాయకులు యుఎస్ఎన్ రాజు, జోన్ నాయకులు జి అప్పలరాజు, రమణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

చెరుకు రైతుల ఆందోళన

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం చెరుకు కాటా వద్ద కూటమి రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. రావికమతం చెరుకు కాటా వద్ద ఉన్న చెరకు ఎండకు ఎండి పూర్తిగా తూకం తగ్గిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నట్లు రావికమతం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంజి ఈశ్వరరావు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరరావు లతో పాటు పలువురు రైతులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే రైతులు చెరుకు ఫ్యాక్టరీకి తోలి పూర్తిగా నష్టపోతున్నామని, గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇచ్చిన డబ్బులు కూడా ఏళ్ల తరబడి రైతులకు అందలేదని, ఇలా అయితే రైతు పరిస్థితి అప్పులు పోలేనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పొలం నుంచి కాటాకు వచ్చిన చెరకును వెంటనే ఫ్యాక్టరీకి తరలించాలని, లేనిపక్షంలోపూర్తిగా ఎండి బెండులుగా తయారవు తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా సకాలంలో చెరుకును ఫ్యాక్టరీకి తరలించ లేదని, ఫ్యాక్టరీ క్రసింగ్ సరిగా జరపలేదన్నారు. తరచూ మరమ్మతులకు గురి కావడంతో చెరుకు తరలించేందుకు లారీలు ఎప్పుడు వస్తాయోనని రైతులు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఫ్యాక్టరీకి చెరుకు వేయడం పూర్తిగా మానుకొని, ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవడం, లేదా బెల్లం తయారు చేసుకొని అమ్ముకోవడం ఉత్తమని పలువురు

నినాదాలు చేస్తున్న చెరుకు రైతులు

పనులపై ఆరా తీస్తున్న డుమా పీడీ పూర్ణమాదేవి

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం

ప్రజాశక్తి-మాడుగుల:జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారిపై నైనా చర్యలు తప్పవని డుమా పీడీ పూర్ణిమా దేవి తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మాడుగుల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పీడీ పూర్ణిమా, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా 29 పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందం నిర్వహించిన తనిఖీల నివేదికను వెల్లడించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు సోషల్ ఆడిట్లో వెల్లడైన నేపథ్యంలో పూర్ణిమ దేవి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారు పనితీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథక రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బూరె బాబురావు, ఏపీడి శ్రీనివాస్, ఎస్ఆర్‌పి రాజేంద్ర, దేముడు, జగ్గారావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కతో చేసిన పనిముట్లు

సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

-చెక్కతో పనిముట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చిన్నదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ రవి చెక్కతో పనిముట్లు తయారు చేసి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు. గురువారం కార్పెంటర్ దినోత్సవం సందర్భంగా చెక్కతో వివిధ పనిముట్లు తయారు చేసి వడ్రంగి వృత్తిదారులకు శుభాకాంక్షలు తెలియజేశాడు.



ఎంపికైన విద్యార్థులు

నవోదయలో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నక్కపల్లి:నవోదయ ప్రవేశ పరీక్షలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి వారిచే జనవరి 18న నిర్వహించబడిన 2025-2026 ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో శ్రీప్రకాష్ విద్యాసంస్థలో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ముత్యాల విశ్రుత్, మేడిశెట్టి హవిష్, కొంజర్ల వెంకట చంద్రమౌళి, దూలపల్లి విఖ్యాత్ ఎంపికయ్యారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్. వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య

అంగన్వాడీలకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు పోషణ్ భీ పడాయి భీ అనే కార్యక్రమంలో భాగంగా రెండవ దఫా శిక్షణ బుధవారం ముగిసింది. ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్య హాజరై శిక్షణ ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సూపర్వైజర్లు లలిత, కనకదుర్గ అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సామర్థ్యవంతంగా నిర్వహించాల న్నారు. బాల్య సంరక్షణ, విద్యతో పాటు అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూలు కార్యక్రమాలు మరింత నైపుణ్యంతో నిర్వహించేందుకుగాను శిక్షణ ఇచ్చారు.

చింతపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వారపు సంత రోజు కావడంతో హఠాత్తుగా పడిన వర్షం కారణంగా సంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షంతో వ్యవసాయ భూములకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది. రోడ్లు జలమయం కావడంతో ప్రజలు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు.